సాక్షి
శ్రీకాకుళం
గురువారం, 13, జూలై, 2023



అభివృద్ధికి అడ్డుకాదు

మూలపేట పోర్టు రోడ్డు నిర్మాణానికి తాము అడ్డంకి కాదని రైతులు స్పష్టం చేశారు. అయితే సరైన పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

- 8లో



స్కోచ్ అవార్డ్స్ 'ఈ-కోర్టు'

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎస్పీ జి.ఆర్.రాధిక పర్యవేక్షణలో ఐటీ కోర్ విభాగం సిబ్బంది రూపొందించిన కోర్టు మానిటరింగ్ సిస్టం. ఈ-కోర్టు' అనే అప్లికేషన్ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డ్స్ నామినేషన్స్‌లో సెమీఫైనల్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఇన్‌చార్జి మంత్రి జిల్లా పర్యటన రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం కలెక్టరేట్‌కి చేరుకుని ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించనున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులుపాల్గొంటారని తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 3 బృందాలతో కుటుంబ సర్వేలు



సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆరో రౌండ్‌కు సంబంధించి జిల్లాలో మూడు బృందాల ద్వారా ఇంటింటి సర్వే చేపడుతున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ప్రజల ఆరోగ్య సదుపాయాలు, ఫీవర్ సర్వే ప్లానింగ్, ఎన్‌సీడీ సర్వే, లెప్రసీ ప్రోగ్రాం తదితర అంశాలపై సర్వే చేపట్టాలని సూచించారు. సమావేశంలో సిగ్మా రీసెర్చ్ బృందం ప్రతినిధులు విజయ్‌కుమార్, భరద్వాజ్, డాక్టర్ తులసీరామ్, కోఆర్డినేటర్లు రోజా, కిరణ్ కుమార్, విక్టర్, జ్యోతి పాల్గొన్నారు.

వరుణ దేవుడి కరుణ కోసం..



కొండపై పాయసం పోసి పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: సమృద్ధిగా వానలు కురిసి పుష్కలంగా పంటలు పండాలని ఆకాంక్షిస్తూ జలుమూరు మండలం కరకవలస సమీపంలోని పద్మనాభ స్వామి కొండపై శ్రీముఖలింగేశ్వరిని క్షేత్రపాలకుడైన మహావిష్ణువుకు అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కొండపై పాయసం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

తీరం..గస్తీ ముమ్మరం



తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్

రణస్థలం: తీరప్రాంతం గుండా ముష్కరుల చొరబాట్లు అరికట్టేందుకు చేపట్టిన సాగర్‌కవచ్ మాక్‌డ్రిల్ విజయవంతమైంది. జిల్లావ్యాప్తంగా తీరప్రాంతంతో పాటు మైదాన ప్రాంతాల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. రణస్థలం మండలం కొచ్చెర్ల, కొమరవానిపేట, జీరుపాలెం, అల్లివలస, కొవ్వాడ, దొనిపేట సముద్ర తీర ప్రాంతాలను జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ పరిశీలించారు. సముద్ర తీరప్రాంతంలో గస్తీ ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. ముంబైదాడులు జరిగినప్పటి నుంచి తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తీరంలో అపరిచితుల కదలికలపై సమాచారం ఇవ్వాలని మత్స్యకారులకు సూచించారు.

21న ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌సెల్ నిర్వహించనున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 21న నిర్వహించనున్న గ్రీవెన్స్‌ను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆత్మీయ నేస్తం

సేవా హస్తం

- వలంటీర్ల సేవలపై జనం హర్షధారలు



కారుచీకటి వంటి అంధత్వం కమ్మేస్తే.. కదిలేది లేదని కాళ్లు మొరాయిస్తే.. నిస్సహాయురాలై గడప దాటలేని దీనస్థితిలో ఉన్న ముదుసలికి ఇదిగో నీ పింఛనని మంచం చెంతకే తెచ్చి నెల మొదటి రోజునే అందిస్తున్నాడా మనవడు.. మనసైన ఆత్మీయుడు.



భర్త చనిపోయి.. ఒంటరై.. కష్టాలు ఊపిరిసలపకుండా చుట్టుముట్టిన తరుణంలో.. వితంతు పింఛన్ మంజూరయ్యేంత వరకు నాదీ భరోసా అంటూ చేదోడుగా నిలిచిందా చెల్లి.. రెండు పదుల వయస్సున్న కల్పవల్లి.



కరోనా కష్టం వెంటాడిన వేళ.. గడప దాటని పరిస్థితుల్లో తాగునీరు అందించే బోరు మరమ్మతులకు గురైతే ఊరి సౌఖ్యమే తన ధ్యేయ మని భావించి పట్నానికి వెళ్లి విడిభాగాలు తీసుకొచ్చి ఊరి ప్రజల దాహార్తి తీర్చి ధన్యుడయ్యాడా తమ్ముడు.. ఊరి ప్రజలకు ఆపద్బాంధవుడు.



ఇలాంటి లక్షలాది మంది ఆర్తులకు.. చేయూతనందించేందుకు నిత్యం సంసిద్ధులై సేవలందిస్తూ ప్రజలతో శభాష్ అనిపించుకుంటున్నారు ఎందరో యువ సైనికులు. వారే మన వలంటీర్లు. నిస్వార్థంగా పనిచేస్తున్న ఈ సేవాసైన్యంపై జనం హర్షధారలు కురిపిస్తున్నారు.

- జి.సిగడాం/రణస్థలం/ సరుబుజ్జిలి/గార/పాతపట్నం

ఇంద్ర భవనాల్లో ఉన్నవారికేం తెలుసు?



కరోనా సమయంలో చంద్రబాబు, పవన్ ఇంద్రభవనాల్లో దాగుంటే, వలంటీర్లు ప్రాణాలు ఫణంగా పెట్టి అహోరాత్రులు పని చేశారు. అలాంటి పవిత్రమైన వలంటీర్లపై పవన్ కల్యాణ్ ఆరోపణలు చేయడం దిగజారుడు తనానికి నిదర్శనం.

- తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

అన్నీ తానై..



నా భర్త చనిపోయి కష్టాల్లో ఉన్నాను. ఆ సమయంలో వలంటీర్ బోనెల శ్రావణి వచ్చి మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయించడం నుంచి వితంతు పింఛన్ వచ్చేంత వరకు తనే అన్నీ చూసుకుంది. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండా శ్రావణియే అన్ని పనులు చేసిపెట్టింది. ఇంటికి పెద్దదిక్కులా సేవలందించి ఆదుకుంది.

- దేవరపల్లి పద్మ, వితంతు పింఛన్ లబ్ధిదారు, కొండములగాం, రణస్థలం మండలం

వలంటీరే ఆధారం..



నా వయస్సు 86 సంవత్సరాలు. నాలుగేళ్ల ముందు వరకు పింఛన్ అందేది కాదు. ఏదో కారణం చెప్పేవారు. జగన్‌బాబు వచ్చాక పథకాలు రావడం మొదలైంది. వలంటీరు అనిల్‌బాబు ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నాడు. నా భార్య సూరమ్మకు చేయూత పథకం ఇస్తున్నారు. రజకులం కాబట్టి చేదోడు పథకం కింద రూ.10 వేలు అందుతున్నాయి. వలంటీరు ప్రతి నెలా మా ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు అందించి ఆసరాగా నిలుస్తున్నాడు.

- బొద్దూరు రాములు, అంపోలు, గార మండలం

వలంటీర్ మేలు జన్మలో మరువలేము

మాది కోటపాలెం గ్రామం. నా భర్త సంతోష్ కుమార్ టాక్సీ డ్రైవర్గా పని చేస్తున్నారు. మాకు ఏడాదిన్నర బాబు గగన్ కు గుండెలో రంధ్రం ఏర్పడడంతో ఏమి చేయాలో తోచలేదు. స్థానికంగా ఎన్ని ఆస్పత్రిల్లో చూపించినా ఫలితం లేకపోయింది. తిరుపతి లో గుండె ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. ఆ సమయంలో మాకు ఎంతమంది సహాయంగా నిలిచినా మా వలంటీర్ చౌదరి నాగరాజు చేసిన మేలు మా జన్మలో మర్చిపోలేము. తాను చొరవ తీసుకుని తెలిసిన వారి ద్వారా అమౌంట్ కలెక్ట్ చేసి దాదాపు రూ.80 వేలు అందజేశాడు. అప్పట్లో సాక్షి లో కూడా మా అబ్బాయి కోసం కథనం వచ్చింది. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కొంత సొమ్ము వచ్చింది. వీరందరి ద్వారా మా అబ్బాయి మళ్లీ మా కళ్ల ముందు తిరుగున్నాడు. మా జీవితంలో మళ్లీ సంతోషం నింపిన వారిలో మా వలంటీర్ ముందున్నాడు. మాలాగే అందరి ఆశీస్సులు అతనిపై ఉండాలని కోరుకుంటున్నాం.



- భోజనాల వైదేహి, కోటపాలెం, రణస్థలం మండలం

మనవడిలా ఆదుకున్నారు



చిత్రంలో మంచంపైన ఉన్న ఈమె పేరు సోనారి పెంటమ్మ. వయస్సు 85 ఏళ్లు. సంతవురిటికి చెందిన ఈమెకు రెండు కళ్లు, కనిపించవు. కాళ్లు పని చేయవు. అంతా మంచం పైనే. రాజన్న హయాంలో రూ.200 పింఛన్ వచ్చేది. ఆధార్ అనుసంధానం చేశాక వేలిముద్రలు పడకపోవడంతో పింఛన్ నిలిచిపోయింది. నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయం వ్యవస్థ ద్వారా గ్రామ వలంటీర్లను నియమించడంతో వృద్ధురాలి సమస్య వెలుగులోకి వచ్చింది. వలంటీరు బాల బొమ్మ తులసీ కృషితో దివ్యాంగ పింఛన్ ఎట్టకేలకు మంజూరైంది. ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ తులసీ వృద్ధురాలి ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నారు.



శభాష్ పూర్ణారావు..

ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఈ వ్యక్తి పేరు బెండి పూర్ణారావు. సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం పంచాయతీ వ్యాసులపేట గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. 2020 మేలో కోవిడ్ సమయంలో వ్యాసులుపేట గ్రామంలో తాగునీటి బోరు పాడైంది. ఒక్క బోరుకావడం, సిబ్బంది విధులకు రాలేని పరిస్థితి నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వలంటీర్ తన తోటి మిత్రుల సహకారంతో బోరు విడిభాగాలు కార్యాలయం నుంచి తెప్పించి బోరు బాగు చేయించి ప్రజలకు తాగునీరు అందించారు. వలంటీర్ సేవల పట్ల ప్రజలు హర్షం ప్రకటించారు.

జీవితంలో మర్చిపోలేను..

రెండేళ్ల క్రితం బూరగాం గ్రామానికి జిల్లాలో మొట్టమొదటి కరోనా వ్యాధి ఓ వ్యక్తి ద్వారా వచ్చింది. మా గ్రామాన్ని రెడ్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. వీధుల్లో ఎవరు తిరగనీయకుండా, గ్రామం చుట్టూ పోలీసులు మోహరించారు. ఇంట్లో ఒక్కడ్నే ఉన్న నాకు జ్వరం వచ్చింది. భయపడిపోయాను. జ్వరం వచ్చిందని వలంటీర్ గోపికి ఫోన్ చేశాను. వెంటనే వలంటీర్ వచ్చి ధైర్యం చెప్పి, స్కూల్ బస్సులో పాలకొండ ఏరియా ఆస్పత్రికు తరలించి ప్రాణాలు కాపాడారు. వలంటీర్ సేవ జీవితంలో మరిచిపోలేను.



-గణేష్ బరోడా, బూరగాం, పాతపట్నం మండలం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- జగనన్న సురక్షకు అత్యంత ప్రాధాన్యం
- జెడ్పీ స్థాయి సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ విజయ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ. చిత్రంలో సీఈవో వెంకటరామన్

అరసవల్లి: రానున్న వర్షాకాలంలో సీజనల్ జ్వరాలు విజృంభించే అవకాశమున్నందున వైద్యారోగ్యశాఖాధికారులు, పంచాయతీ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. 1వ, 2వ, 4వ, 7వ స్థాయి సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహిస్తూ పలు శాఖల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత మెరుగుపర్చాలని.. ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని బట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారులు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. అర్హులైనప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారికి ఇదో అద్భుత అవకాశమన్నారు. అధికారులు వెంటనే అర్హతలను గమనించి సంక్షేమ లబ్ధిని చేకూర్చాలని..దీంతో జిల్లాలో అర్హుల్లో శతశాతం మందికి ప్రభుత్వ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించి కార్యక్రమం అమలు చేసినట్లు ప్రకటించారు. జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలు, మంచి నీటి బోర్లు మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. ఆమదాలవలస- శ్రీకాకుళం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో జాప్యంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని..వెంటనే పనులు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధ్యాహ్నం 3వ స్థాయి సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, 5వ స్థాయి సమావేశానికి వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, 6వ స్థాయి సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావులు అధ్యక్షత వహించి పలు శాఖల ప్రగతి నివేదికపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లా గ్రామీణాభివృద్ధికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ మరణించిన పలువురు ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్‌లు అందజేశారు.

శభాష్ సత్యవతి

- అంధుల క్రికెట్ ప్రపంచకప్ పోటీలకు జీరుపాలెం యువతి



సత్యవతి

రణస్థలం:సిక్కోలు బిడ్డ మాగుపల్లి సత్యవతి భారత అంధుల మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికై చరిత్ర సృష్టించింది. రణస్థలం మండలం జీరుపాలెం గ్రామానికి చెందిన ఈ మత్స్యకార యువతి ఆగస్టు 17 నుంచి 27వ తేదీ వరకు ఇంగ్లండ్‌లో జరిగే అంధుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో భారత్ తరపున ఆడనుంది.

పుట్టింది జీరుపాలెంలో చదివింది వైజాగ్‌లో..

రణస్థలం మండలంలోని జీరుపాలెం గ్రామంలో సత్యవతి తల్లిదండ్రులు మాగుపల్లి లక్ష్మణ, పోలమ్మ చేపలు వేట చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చేపల వేటకు వెళితే గానీ వీరికి పూట గడవదు. సత్యవతికి చూపు అంతగా లేకపోయినా ఏ లోటూ లేకుండా పెంచారు. శ్రీకూర్మంలోని ఆస్పత్రికి తీసుకెళ్తే 40 శాతం అంధత్వం ఉందని చెప్పారు. అక్కడ ఓ నర్సు చెప్పిన సలహా మేరకు విశాఖపట్నంలోని సాగర్‌నగర్‌లో గల జీఆర్‌వీ హెచ్ బాలికల అంధుల పాఠశాలలో సత్యవతి చదివింది. అప్పటికే క్రీడల్లో మంచిగా రాణించడంతో పీఈటీ సలహా మేరకు భీమిలిలోని చినజీయర్ స్వామి ట్రస్టు నిర్వాహకులను కలిస్తే.. అక్కడే వసతి, భోజనం పెట్టి ప్రోత్సహించారు. చినజీయరు నేత్ర విద్యాలయంలో ఉంటూ బయట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, అల్వదాస్ ఎస్‌వీవీపీ వీఎన్‌సీ డిగ్రీ కళాశాలలో చేరింది. బీఏ ఫైనల్ ఇయర్‌లో ఉండగా టీమిండియాకు ఎంపికైంది.

క్రికెట్‌తో పాటు..

సత్యవతికి క్రికెట్‌తో పాటు ఇంకా ఎన్నో క్రీడల్లో ప్రవేశం ఉంది. 2014లో 6వ తరగతిలో వెయిట్ లిఫ్టింగ్‌లో స్టేట్‌ఫస్ట్ సాధించింది. 2018లో టెన్త్‌లో ఉండగా అంధుల విభాగంలో జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రోలో కూడా జాతీయ స్థాయిలో సత్తా చాటింది. శ్రీలంకలో జరిగిన పోటీల్లోనూ ప్రతిభ చూపింది. అనంతరం క్రికెట్‌పై మక్కువ పెంచుకుని కీపర్‌గా రాణించింది. 2020లో ఆంధ్రా తరఫున ఆడింది. 2021, 2022లో బెంగళూరులో జరిగిన నగేష్ ట్రోఫీలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. 2023 ఫిబ్రవరిలో భోపాల్ నిర్వహించిన భారత జట్టు ఎంపిక పోటీలకు నలుగురు వికెట్ కీపర్లను ఎంపిక చేయగా అక్కడ రాణించి నేపాల్‌లో జరిగిన సిరీస్‌కు ఎంపికైంది. ఇప్పుడు టీమిండియాకు ఎంపికైంది.

డీఈవోగా తప్పుకున్న తిరుమల చైతన్య

- ఇన్‌చార్జి డీఈవోగా ఆర్జేడీ జ్యోతికుమారి



ఎం.జ్యోతికుమారి



ఎస్.తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఎస్.తిరుమల చైతన్య బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆరోగ్యం సహకరించడంలేదని, పనిఒత్తిడి కారణంగా డీఈవో బాధ్యతల నుంచి తప్పుకుంటానని కోరుతూ పాఠశాల విద్య కమిషనరేట్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో తిరుమల చైతన్యను డీఈవో బాధ్యతల నుంచి తప్పిస్తూ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉప విద్యాశాఖాధికారిగా కూడా పనిచేస్తున్న ఆయన ఆ బాధ్యతల నుంచి కూడా పూర్తిగా తప్పుకుని.. గార మండలం వమరవల్లి ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగడానికే మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవలి ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులకు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడంతో.. తనను డీఈవో బాధ్యతల నుంచి తప్పిస్తారని ముందుగానే గ్రహించి.. తిరుమల చైతన్య తప్పుకున్నారని విద్యాశాఖలో ప్రచారం జరుగుతోంది.

ఆర్జేడీగా జ్యోతికుమారికి బాధ్యతలు..

పాఠశాల విద్య విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ)గా పనిచేస్తున్న మణిపాత్రుని జ్యోతికుమారిని జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు వెలువరించారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.జ్యోతికుమారి 2019 జూలైలో రెండు వారాలపాటు డీఈవోగా పనిచేశారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల సమయంలో జిల్లా పరిశీలకురాలిగా పలుమార్లు పనిచేశారు.

క్లుప్తంగా

ఆర్‌ఎంపీలను గుర్తించాలని వినతి

అరసవల్లి: గ్రామాల్లో ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్న ఆర్‌ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని ఉత్తరాంధ్ర ఆర్‌ఎంపీ వైద్యుల సంఘ అధ్యక్షుడు జంగం జోషి కోరారు. ఈమేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షిని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గ్రామీణ వైద్యుల వివరాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.తిరుపతిరావు, చౌదరి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి, గోవిందరావు, బెహరా రాధిక, ఉమాశంకర్, రాము ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి



ఆదిత్యుని జ్ఞాపికను శివనాథ్‌రెడ్డికి అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శాసనమండలి సభ్యుడు సీహెచ్ శివనాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, అర్చక బృందం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను, పర్వదినాల ప్రత్యేకతలను అర్చకులు వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి క్షేమేంద్రశర్మ, మాధవశర్మ ఉన్నారు.

కొండచిలువ కలకలం



హతమైన కొండచిలువ

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో భారీ కొండచిలువ బుధవారం కలకలం రేపింది. నల్ల చెరువులో వేతనదారులు పనులు చేస్తుండగా సుమారు 12 అడుగుల కొండచిలువ బయటకు రావడంతో భయంతో పరుగులు తీశారు. తరువాత కొందరు ధైర్యం చేసి కర్రలతో దాన్ని హతమార్చడంతో వేతనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ కాంట్రాక్టర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ బెండి శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ–2 రమేష్‌బాబు బుధవారం తెలిపారు. కాంట్రాక్టర్ శ్రీను తనపట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అవహేళన చేస్తూ మాట్లాడుతున్నాడని గూడేం గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ బుసకల భాస్కరరావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బంగారు చంద్రయాన్



బంగారపు సూక్ష్మచంద్రయాన్

కాశీబుగ్గ: ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్–3 ప్రాజెక్టును పురస్కరించుకుని కాశీబుగ్గకు చెందిన కొత్తపల్లి రమేష్ బుల్లి చంద్రయాన్ నమూనా రూపొందించారు. బంగారంతో తయారుచేసిన ఈ నమూనాను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం



ఇందుమతి (ఫైల్)

శ్రీకాకుళం రూరల్ : మండల పరిధిలోని తండేవలస ఆర్టీవో కార్యాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.ఇందుమతి (18) అనే యువతి మృతిచెందింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం రొట్టవలసకు చెందిన ఇందుమతి ఇటీవలే డిప్లమో పూర్తిచేసింది. తండ్రితో కలిసి శ్రీకాకుళంలో షాపింగ్ చేసేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయల్దేరారు. షార్ట్‌కట్ రూట్‌లో తండేవలస నుంచి శ్రీకాకుళం వస్తుండగా ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో యువతి అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు రక్ష.. | జగనన్న సురక్ష



ధ్రువ పత్రాలతో మహిళ

జగనన్న సురక్ష పేదల పాలిట వరంలా మారింది. 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువపత్రాలను ప్రభుత్వం సచివాలయం, వలంటీర్ల ద్వారా నిమిషాల వ్యవధిలోనే అందజేస్తోంది. అర్హతలు ఉండి వివిధ కారణాలతో పథకాలకు నోచుకోని వారికి చేయూతగా నిలుస్తోంది. శ్రీకాకుళం నగర పరిధిలోని టౌన్‌హాలు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష హెల్ప్‌డెస్క్ వద్దకు ఒక్కొక్కరుగా చేరుకుని సమస్యలు విన్నవిస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే సిబ్బంది త్వరితగతిన స్పందించి సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



హెల్ప్ డెస్క్ వద్దకు వచ్చి సమస్యలు చెబుతున్న ప్రజలు



ఆధార్‌కార్డు కోసం వేలిముద్రలు వేస్తున్న దృశ్యం



వెల్ఫేర్ డెస్క్‌లో సమస్య వివరిస్తున్న మహిళ



రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న దృశ్యం



ధ్రువపత్రాలు సిద్ధం చేస్తున్న దృశ్యం



ధ్రువపత్రాన్ని సరిచూసుకుంటున్న వృద్ధ దంపతులు

అభివృద్ధికి అడ్డుకాదు

- న్యాయ పరంగా పరిహారం ఇప్పించండి
- అభిప్రాయం వ్యక్తం చేసిన పోర్టు రోడ్డు ప్రభావిత గ్రామాల రైతులు



పోర్టు రోడ్డు ప్రభావిత రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: మూలపేట పోర్టు రోడ్డు నిర్మాణానికి తాము ఎటువంటి అడ్డంకి కాదని రైతులు స్పష్టం చేశారు. అయితే తరాల నుంచి జీవనోపాధిగా ఉన్న తన భూములకు న్యాయపరంగా పరిహారం ఇప్పించాలని టెక్కలి మండలం వేములవాడ, బన్నువాడ, మోదుగవలస గ్రామాలకు చెందిన పోర్టు రోడ్డు ప్రభావిత రైతులు విజ్ఞప్తి చేశారు. పోర్టు రోడ్డు ప్రభావిత గ్రామాలకు చెందిన రైతులతో టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వేములవాడ గ్రామానికి చెందిన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద పోలాకి చంద్రశేఖర్‌తో పాటు పలువురు రైతులు మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణానికి భూమిలివ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే తమకు న్యాయపరంగా పరిహారం ఇప్పించడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పోర్టు రోడ్డు వలన మిగిలిన భూములకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించారు. అనంతరం బన్నువాడ, మోదుగువలస గ్రామాలకు చెందిన రైతులతో సబ్ కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోలాకి మోహన్‌రావు, గ్రామ పెద్దలు ఎం.దుర్యోధనరావు, ఎస్.మన్మథరావుతో పాటు పలువురు రైతులు మాట్లాడారు. తరాల నుంచి జీవనోపాధిగా ఉన్న తమ భూములను కోల్పోతున్నందుకు బాధగా ఉందన్నారు. అయితే అభివృద్ధికి తాము ఏమాత్రం అడ్డుకాదని తేల్చిచెప్పారు. తమకు న్యాయ పరంగా అధికంగా పరిహారం వచ్చే విధంగా సాయం అందజేయాలని ముక్తకంఠంతో కోరారు. ఈ సందర్భంగా రైతులంతా డిమాండ్లతో కూడిన పత్రాన్ని సబ్ కలెక్టర్‌కు అందజేశారు.

అభివృద్ధి మీ చేతుల్లోనే ఉంది: సబ్ కలెక్టర్

అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పోర్టు రోడ్డుకు సంబంధించి భూసేకరణ విషయంలో ఇప్పటికే అనేక దఫాలుగా రైతులతో చర్చలు నిర్వహించామని గుర్తు చేశారు. అంతే కాకుండా నోటీసులు సైతం జారీ చేశామన్నారు. రోడ్డు ఆపేస్తారనే బయటవారి మాటలు నమ్మి రైతులు నష్టపోవద్దని సూచించారు. పోర్టు వలన మీ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా రైతులకు పరిహారం ఇచ్చేందుకు నష్టాన్ని అంచనా వేశామని పేర్కొన్నారు. ఈ విషయంలో చట్టాన్ని గౌరవిస్తూ మరో వైపు రైతుల త్యాగాల పట్ల మానవత్వంతో చర్యలు చేపడుతున్నామన్నారు. భూములిచ్చే విషయంలో రైతులంతా భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా స్కిల్ సెంటర్ సైతం ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. పోర్టు నిర్మాణంలో భాగంగా అవసరమైన ప్రతి అంశాన్ని దృష్టిలో పెట్టుకుంటున్నామని, పరిహారం విషయంలో ప్రతిఒక్కరికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులంతా అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17వ తేదీలోగా రైతులంతా పూర్తి అభిప్రాయం తెలియజేయాలన్నారు. ఆ తరువాత చట్టపరంగా ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

వరకట్న వేధింపులకు మహిళ బలి

అక్కిరెడ్డిపాలెం: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గాజువాక ఏసీపీ త్రినాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆమదాలవలసకు చెందిన కొత్తకోట లక్ష్మి (27), సంతోష్ దంపతులు కొద్ది సంవత్సరాల క్రితం వాంబేకాలనీకి వచ్చి స్థిరపడ్డారు. ఇద్దరూ కూలిపనులు చేసుకుని జీవించేవారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన సంతోష్ రాత్రి ఇంటికి వచ్చేసరికి లక్ష్మి ఉరి వేసుకుని ఉండటంతో, వెంటనే ఆమదాలవలసలో ఉంటున్న లక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంతోష్, లక్ష్మి మధ్య మనస్పర్థలున్నాయని, వరకట్న వేధింపులు కూడా కలహాలకు కారణమని ఇరుగుపొరుగు వారు తెలిపారు. సంతోష్ మద్యానికి బానిసై నిత్యం లక్ష్మిని వేధింపులకు గురి చేసేవాడని తెలియజేశారు. అదనపు కట్నం తేవాలని తమ కుమార్తెను నిత్యం వేధించేవాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరు



నారాయణపురం కుడి కాలువను పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గోకర్నపల్లిలో నారాయణపురం కుడి కాలువను బుధవారం పరిశీలించారు. కింతలి చానల్ పరిధిలో బెలమాం, లొద్దలపేట, తాడివలస, లచ్చయ్యపేట, గంగ్రేడు, బొడ్డేపల్లి, మోదలవలస, కింతలి గ్రామాల రైతులు ఇటీవల స్పీకర్‌ను కలిసి తమ పొలాలకు సక్రమంగా సాగునీరు అందటం లేదని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గోకర్నపల్లి–కావలి రహదారిలోని కాలువను పరిశీలించారు. కావలి వారధి వద్ద డైవర్షన్ ద్వారా కింతలి చానల్‌కు సాగునీరు అందేదని చెప్పారు. అయితే కాలువను అభివృద్ధి చేసిన తర్వాత సాగునీరు ఉధృతి పెంచారని దీంతో కింతలి చానల్‌కు నీరు అప్‌లిఫ్ట్ కావడంతో సమస్యలు వచ్చాయని గుర్తించినట్లు స్పీకర్ పేర్కొన్నారు. సాగునీరు ఆయా గ్రామాలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఈఈ సుధాకర్‌కు ఆదేశించారు. సాగునీరు సర్దుబాటు అవుతున్న ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, తమ్మినేని వాసు, చింతాడ ప్రసాద్ ఉన్నారు.

సక్రమంగా మెనూ అమలు



కె.కొత్తూరు పాఠశాలలో తనిఖీ చేస్తున్న కాంతారావు, లక్ష్మీరెడ్డి

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఇచ్చే జగనన్న గోరుముద్ద, పౌష్టికాహారం అమలు విషయంలో మెనూను సక్రమంగా అమలు చేయాలని ఏపీ ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు, ఇ.లక్ష్మీరెడ్డి స్పష్టం చేశారు. టెక్కలి మండలం కె.కొత్తూరులోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం చాకిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం ఆహారాన్ని పిల్లలకు అందజేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అటువంటి వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కట్టెలపొయ్యిపై ఆహారం వండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరితో పాటు ఎంఈవో తులసీరెడ్డి ఉన్నారు.

దూరవిద్య డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూర విద్యా విధానంలో డిగ్రీలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, కోఆర్డినేటర్ ఎ.రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి అడ్మిషన్లు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో గల కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

జనరల్ స్టోర్‌లో చోరీ



దొంగతనం జరిగిన షాపును పరిశీలిస్తున్న క్లూస్ టీం

కంచిలి: కంచిలి మెయిన్ రోడ్డులోని రైల్వేస్టేషన్ కూడలిలో ఉన్న ఓ జనరల్ స్టోర్‌లో చోరీ జరిగింది. ఈ మేరకు యజమాని స్టోర్ యజమాని శాసనపురి రామారావు బుధవారం ఉదయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి స్టోర్‌ను మూసేసి వెళ్లిపోయిన రామారావు.. బుధవారం ఉదయం షాపు తెరిచి చూసేసరికి సామానులన్నీ చిందరవందరగా పడి ఉండటం, పైకప్పుగా ఉన్న రేకుకు రంధ్రం పడి ఉండటాన్ని గమనించారు. క్యాష్ బాక్సులో ఉంచిన సుమారు రు. 50 వేల నగదు, కొన్ని సామానులు చోరీకి గురైనట్టు గుర్తించారు. రేకుకు రంధ్రం చేసి దొంగలు లోనికి ప్రవేశించినట్టు భావిస్తున్నారు. రామారావు ఫిర్యాదు మేరకు బారువ ఎస్సై ఎస్.చిరంజీవి నేతృత్వంలో బుధవారం సాయంత్రం క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు.

హక్కుల సాధనకు సిద్ధం కావాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హక్కుల సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజనలంతా ఉద్యమానికి సిద్ధం కావాలని జాతీయ బీసీ సంఘ నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. దీనికోసం రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ప్రజా సింహగర్జన సన్నాహక సభ నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బహుజనుల ఐక్యత, హక్కుల సాధన కోసం చర్చించారు. ఈ సందర్భంగా రామచంద్రయాదవ్ మాట్లాడుతూ.. పాలిస్తున్న రాజకీయ పార్టీలన్నీ వారి వారి స్వార్థపూరిత అభివృద్ధికి ప్రయత్నిస్తున్నాయే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నెల 23న మంగళగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి సభకు బడుగు బలహీన వర్గాల ప్రజాప్రతినిధులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కాగితాపు వెంకటరమణ, పానిలా ప్రసాద్, ఇప్పిలి చిన్న, పిట్ట చంద్రపతిరావు, కంఠ వేణు, జాడ శ్రీను, కలగ కన్నంనాయుడు, ముద్దాడ రాజశేఖర్, గద్దిబోయిన కృష్ణ, ఎం.శ్రీనివాసరావు, నారాయణరావు చౌదరి పాల్గొన్నారు.

మహేంద్రతనయ నదిలో పడి వ్యక్తి మృతి



ఆనందరావు మృతదేహం

పాతపట్నం: మహేంద్రతనయ నదిలో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పాతపట్నం–కాపుగోపాలపురం మధ్య నీలకంఠేశ్వర ఆలయం సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకోగా.. సోభ పంచాయతీ కరడసింగిగూడకు చెందిన సవర ఆనందరావు (38) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందరావు పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద మహేంద్రతనయ నదీ కాజ్‌వే వద్దకు బహిర్భూమి కోసం వెళ్లాడు. అయితే ప్రమాదశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు. సమీపంలో ఉన్న యువకులు చూసి నదిలోకి దూకి ఆనందరావును బయటకు తీసుకొచ్చారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఎస్సై మహమ్మద్ యాసీన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. మృతుడికి భార్య సుహాసిని, బాబు అంజనేయులు ఉన్నారు.

ఇంటి నుంచి వెళ్లి.. శవమై తేలి..

వజ్రపుకొత్తూరు: గోవిందపురం గ్రామానికి చెందిన గేదెల రమేష్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం చెరువు గట్టుపై శవమై తేలినట్టు వజ్రపుకొత్తూరు ఎస్సై వై.మధుసూదనరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇంటి నుంచి బయటకు వెళ్లిన రమేష్ రాత్రయిన తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలో వెతుకుతుండగా.. గోవిందపురం కొత్త చెరువు గట్టుపై రమేష్ శవమై కనిపించాడు. దీంతో స్థానికుల సహకారంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమేష్ మద్యం తాగి రాత్రి వేళ ఇంటికి చేరుకోలేక గట్టుపై రాత్రంతా ఉండిపోవడంతో నీరు అందక దాహంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుని భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై చెప్పారు.

19కల్లా జీడి పరిశ్రమలు తెరుస్తాం



మాట్లాడుతున్న పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్

కాశీబుగ్గ: కొద్దిరోజులుగా మూసివేసిన జీడి పరిశ్రమలను ఈ నెల 19 నాటికి తెరిచేందుకు చర్యలు చేపడుతున్నామని పలాస కాష్యూ మాన్యుఫేక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్ తెలిపారు. పలాస పీసీఎంఏ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతుల పరిస్థితిని గుర్తించిన మంత్రి సీదిరి అప్పలరాజు యాజమాన్యాలతో మాట్లాడారని చెప్పారు. జీడి పిక్కలు పండిస్తున్న అన్ని ప్రపంచ దేశాల్లో ఈఏడాది పంట దిగుబడి ఎక్కువ కారణంగా ధర తక్కు పలుకుతోందన్నారు. విదేశాల నుంచి జీడి పప్పు మన దేశానికి భారీ మొత్తంలో దిగుమతి అవుతుండటమూ కారణమేనని తెలిపారు. ఈ పరిణామాలతో జీడి పప్పు ఉత్పత్తిని ఆపాల్సి వచ్చిందన్నారు. దీనిని రాజకీయం చేయవద్దన్నారు. రైతులు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. సమావేశంలో కోశాధికారి పట్నాల రవికాంత్, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, హరిపురం సంఘ సభ్యులు శ్రీనివాసరావు, మందస సంఘం సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంపైర్ ఎంపికలకు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంపైర్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈవో సంపతరావు సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–19 బాల బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల సమయంలో అంపైర్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని, వివరాలను 9440255255 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,510–00
బంగారం(22సి. 10గ్రా.)	54,550–00
వెండి (కిలో)	76,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210